తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం 06 జూన్ 2025
పేజీలు : 8
Follow :

## జిల్లాలో 3.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

**ధాన్యం కొనుగోలు పూర్తి**

**కేసులు నమోదైన మిల్లర్లపై కఠిన చర్యలు**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**





**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** జిల్లాలో ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి సివిల్ సప్లై అధికారి, డియం, డిఆర్డిఏ పిడి, మెప్మా, డిసిఓ, వ్యవసాయ అధికారులతో ధాన్యం కొనుగోలు పూర్తి అయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐకెపి, మెప్మా, సహకార సంఘాలు, మార్కెటింగ్ లాంటి వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటు జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినందుకు అధికారులను అభినందించారు. ట్రక్ షీట్ ఆన్ లైన్ లో నమోదు చేసిన 48 గంటలలోనే రైతులకి డబ్బులు జమ చేయటం జరుగుతుందని తెలిపారు. వచ్చే సీజన్ నాటికి ప్రతి సెంటర్ లో పాడి క్లినర్స్ ఉండేలా కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సీజన్ లో ఏమైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగితే వాటిని వచ్చే సీజన్ నాటికి పునరావృతం కాకుండా సరిదిద్దుకోవాలని అధికారులకి సూచించారు. కేసులు నమోదు అయిన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అట్టి మిల్లులపై రోజు వారి నివేదికలు తమకి సమర్పించాలని అధికారులకి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం జూన్, జులై, ఆగస్టు నెలలకి కలిపి ఒకేసారి సన్నబియ్యం చివరి కార్డు వరకు అందేలా జూన్ 30 వరకు పంపిణి కొనసాగుతుందని చెప్పారు. లబ్ధిదారులు ఒకేసారి రేషన్ షాప్ లకు ఎక్కువగా వస్తే ఎక్కువ సేపు నిల్చోవలిసి వస్తుంది కాబట్టి రోజు కొంతమంది వచ్చేలా చూసుకోవాలని అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, సివిల్ సప్లై డియం ప్రసాద్, సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డి, డిసిఓ పద్మ, మెప్మా పిడి రేణుక, అగ్రికల్చర్ అధికారి ప్రణవి, సివిల్ సప్లై డిటిలు, ఆర్ఐ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాట ద్వారా ఎక్సైజ్ శాఖకు 2 లక్షల 90 వేలకు పైగా ఆదాయం

**రజిత ఎక్సైజ్ సీఐ**



**తుంగతుర్తి జూన్ 5 (జనంసాక్షి)** తుంగతుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ క్రైమ్ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు గురువారం తుంగతుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ఈ వేలం పాట జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్ లక్ష్మణ్ నాయక్ పర్యవేక్షణలో 20 వాహనాలకు సంబంధించి వేలంపాట నిర్వహించగా 18 వాహనాలు వేలంపాటలో విక్రయించినట్లు తెలిపారు. దీంతో ఈ వేలంపాటలో ఎక్సైజ్ శాఖకు 2 లక్షల 90వేల 980 రూపాయలు రాబడి వచ్చినట్లు తెలిపారు సూర్యాపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ 18 వాహనాలకు 1,66000 విలువ నిర్ధారించగా 75% వేలంపాటలో అధిక రాబడి వచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ ఇన్స్పెక్టర్ కె స్టీఫెన్ సన్. ఎస్సైలు డి మూర్తి. జయప్రకాష్ తోపాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

✧ భూభారతి పై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి

✧ భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

**దేవరకొండ, జూన్ 05 (జనంసాక్షి):** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఆర్డీఓ ఎస్ రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం డివిజన్లోని తహసిల్దార్లతో రాజస్థాన్ మండల అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని సూచించారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్స్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బీలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నిర్దీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండలని, అర్జీలు స్వీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తాసిల్దార్లు, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్క కృషి చేయాలి

**దేవరకొండ మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ కె.అనిత**



**దేవరకొండ, జూన్ 05(జనంసాక్షి)** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, తమ పరిసరా ప్రాంతాలలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించి భావితరాలకు శ్రేష్టమైన వాయువును అందించాలని దేవరకొండ మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ కె అనిత అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సబ్ జైల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. వీరితోపాటు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కెవిఎస్ హరీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు పెంచడం ద్వారా పర్యావరణాన్ని రక్షిస్తుందని, చెట్లు నరకడం నేరంగా పరిగణించాలని, ప్రకృతిలో చెట్లను పెంచి అవి తరాలకు శ్రేష్టమైన వాయువును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు సన్నాయిల ఉమామహేశ్వర్ ఏ జి పి నెమ్మికంటి రమాశంకర్, న్యాయవాదులు వనం జగదీశ్వర్, జున్ను సిద్దయ్య, మరియు కోర్టు సిబ్బంది శ్రీ వాణి, సబ్ జైలర్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి తల్లిని రక్షించుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యత

**మొహమ్మద్ గౌస్ పాషా జూనియర్ సివిల్ జడ్జి**



**తుంగతుర్తి జూన్ 5 (జనంసాక్షి)** ప్రకృతి తల్లిని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు చెట్లు నాటే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ పాషా అన్నారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో అంతర్జాతీయ ప్రపంచ పర్యావరణం దినోత్సవ సందర్భంగా చెట్లు నాటి మాట్లాడారు. పర్యావరణం సమతౌల్యంగా ఉండాలంటే చెట్లు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. చెట్లు మానవ మనుగడకు జీవనాధారం అని అన్నారు పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అని అన్నారు. మొక్కలను పరిరక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి కాబట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరారు చెత్తను విరివిగా నాటి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు అన్నపర్తి జ్ఞాన సుందర్ ఉపాధ్యక్షులు కారింగుల వెంకటేశ్వర్లు సిఐలు నరసింహారావు. రఘువీర్ రెడ్డి న్యాయవాదులు రణధీర్. రాజారామ్. రవికుమార్. వజీర్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కను నాటండి పర్యావరణాన్ని కాపాడండి : సూరిరెడ్డి

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన జడ్జి
- వాయు కాలుష్యాన్ని నివారించండి మొక్కలు నాటండి..






**మణుగూరు, జూన్ 05 (జనంసాక్షి):** పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉంటుందని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి కంబపు సూరిరెడ్డి అన్నారు. గురువారం మణుగూరు కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మణుగూరు కోర్టు నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. మొక్కలు నాటడం వల్ల భవిష్యత్తులో ఎన్నో అనార్థాలను అరికట్టవచ్చు. వృక్షాలను నరకకుండా వాటిని సంరక్షించుకోవాలి.. చెట్లు నాటడం వల్ల ప్రకృతిని రక్షించిన వాళ్ళవుతాం ఏదో ఒక సందర్భంలో మొక్కలు నాటాలి అని కాకుండా మనం నాటే ప్రతి మొక్క అది ఎదిగే వరకు సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉంది. వాయు కాలుష్యాన్ని తగ్గించాలన్న వర్షాలు పడాలన్న మొక్కలు పెంచాలి. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణం పూర్తిగా దెబ్బతింది. ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్తులో ఎన్నో అనర్థాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు,సిఐ నాగబాబు లీగల్ కౌన్సిల్ అంకమ్ సర్వేశ్వరరావు, వీర మధుసూదన్ ,పోశం.భాస్కర్, గద్దల,సాంబశివరావు, సరస్వతి, వాసవి, కోర్టు కానిస్టేబుల్ బుచ్చిబాబు,శ్రీనివాస్,, ఎస్సై రంజిత్,.. రేంజర్ పి ఉపేందర్, అజ్మీర శాంతి, ముజీబుద్దిన్ ఎఫ్ ఎస్ ఓ, రామచంద్రయ్య, ఎఫ్ ,ఎస్ ఓ,చిరంజీవి, నాగేశ్వరరావు, డి రవీందర్, రమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.




## అడవుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

### అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం

**కారేపల్లి, జూన్05 (జనంసాక్షి) :** అడవుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బీ.శ్రీనివాసరెడ్డి అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కారేపల్లి రేంజ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఆర్వో మాట్లాడుతూ అడవులు, వినాశనం, పెరిగిన ప్లాస్టిక్ వినియోగంతో కాలుష్యపెరిగిపోతుందన్నారు. మొక్కలు నాటటం చేయాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ గుడ్డ సంచులు, స్టీల్, కాపర్, గాజు వంటి రిసైల్డ్ మెటీరియల్స్ వస్తువులను వాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆయేషా ఖుధ్దోసియా, ఎఫ్ఎస్‌వో లు చక్రవర్తి, శిల్ప, వీరభద్రం, ఎఫ్‌బీవో లు అఫ్జల్, చందర్, వీరన్న, రమేష్, పద్మ, బాపయ్య, ఉషా, పుష్పలత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




## పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి కొత్త బస్టాండ్ వరకు వాక్ ఫర్ బెటర్ ఎన్విరాన్మెంట్ అంశంపై సింగిల్ యూస్ ప్లాస్టిక్ తిరస్కరించడంపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సలహాదారులు జె.శశిధర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ప్రారంభించి ప్రతి ఒక్కరం పర్యావరణ పరిరక్షణకు బాధ్యులమని అన్నారు.గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షులు ముప్పారపు నరేందర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి ప్రతి ఒక్కరూ ప్రకృతిని గౌరవిస్తూ గాలి,నీరు ఆహారాన్ని కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.పర్యావరణ పరిరక్షణ నినాదాలు చెబుతూ ప్లకార్డ్స్ తో ర్యాలీని నిర్వహించారు.దశరథ ఫౌండేషన్ కొంపల్లి కృష్ణ సహకారంతో ఉచితంగా చేతి సంచులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, బొలిశెట్టి మధు, గుండూరి కృపాకర్, మిర్యాల వెంకటేశ్వర్లు, వనమాల వెంకటేశ్వర్లు, మీలా మహదేవ్, తల్లాడ రామచంద్రయ్య, సోమా సురేష్, అనంతుల సువర్ణ లక్ష్మీ, ముప్పారపు విజయలక్ష్మీ, డాక్టర్ శిరీష, డాక్టర్ అలేఖ్య, యామా రజని, బండి రాధాకృష్ణ రెడ్డి, నల్లపాటి మమత,మున్సిపల్ సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



**చింతపల్లి జూన్ 05 (జనంసాక్షి)** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చింతపల్లి ఎస్సై రామ్మూర్తి అన్నారు. చింతపల్లి మండలం గోడకొండ్ల రిజర్వాయర్ వద్ద మాల్ సాగర్ హైవేపై పోలీసులు విస్తృతంగా తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై ముత్యాల. రామ్మూర్తి మాట్లాడుతూ సాగర్ హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా , 11 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్కు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు సీటు బెల్టు ధరించాలని, ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు ఆర్సీ కలిగి ఉండాలని, అదేవిధంగా ప్రతి ఒక్కరు పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఆయన అన్నారు.

# ఎర్రబోడులో ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణి

## రాజకీయాలకు అతీతంగా పథకాలు



**కారేపల్లి, జూన్05(జనంసాక్షి) :** కారేపల్లి మండలం ఎర్రబోడులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గురువారం అంద చేశారు. ఎర్రబోడు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధృవీకరణ పత్రాలను పంపిణి చేశారు. ఈసందర్భంగా న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎర్రబోడు గ్రామపంచాయతీలో రాజకీయాలకు అతీతంగా పేదలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు ప్రభుత్వ పథకాలను అందిస్తూ అదర్శంగా నిలుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులది ఇది మొదటి జాబితా మాత్రమేనని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చేయటం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్దికి గ్రామపంచాయతీ ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. ఇదే ఐక్యతతో అభివృద్దిలో ఆదర్శంగా నిలవటం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కారేపల్లి సొసైటీ మాజీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కడియాల సుధాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూక్యా వెంకన్న, బోజడ్ల వెంకట్రావు, తమ్మిశెట్టి యాలాద్రి, కొండ జ్యోతిబాసు, కనికరపు నాగయ్య, గాదె ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# వైపరీత్యాలను సమిష్టిగా ఎదుర్కోవాలి

## ప్రత్యేక ప్రణాళికతో ముందుకువెళ్ధారా స్పెషల్ ఆఫీసర్



**కారేపల్లి, జూన్05(జనంసాక్షి) :** ప్రకృతి వైపరీత్యాలను సమిష్టిగా ఎదుర్కొవాలని మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు అన్నారు. ప్రకృతి వైపరీత్యాల నివారణ చర్యలపై గురువారం కారేపల్లి మండలం అప్పాయిగూడెం రైతు వేదికలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం జరిగింది. ఈసమావేశంలో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ వర్షాకాలం లో వరదల తీవ్రతను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తత చేయాలని కోరారు. రహదారులపై ప్రవహాల పట్ల జాగృత వహించాలని ఆ మార్గంలో రాక పోకలను నియంత్రించాల్సి ఉంటుందన్నారు. ఇండ్లలోకి నీరు చేరితే ఆ భాదితులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. వరదల నివారణ, వాటిని ఎదుర్కొవటానికి తీసుకోవల్సిన చర్యలపై ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని గ్రామస్థాయి అధికారులను సూచించారు. మండల స్థాయి నుండి క్రింది స్థాయి వరకు సోషల్ మీడియా గ్రూపును ఏర్పాటు చేసి వాటి ద్వారా సమచారం ఇవ్వటం, అధికారులు ఇచ్చిన సూచనలు పాటించటం చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రకృతి వైపరీత్యాల నివారణకు కమిటీలు వేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జీ.సురేందర్, తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, మండలవైద్యాధికారి డాక్టర్ బీ.సురేష్, పశు వైద్యాధికారి ఎం.ఉపేందర్, ఏబీ ఏఈ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉపయోగపడేలా మహేంద్ర హార్వెస్టర్



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** అధునాతన టెక్నాలజీతో రైతులకు ఉపయోగపడేలా మహేంద్ర హార్వెస్టర్ రూపొందించడం జరిగిందని మహేంద్ర ఫామ్ మిషనరీ తెలంగాణ ఏరియా సేల్స్ మేనేజర్ సాత్విక్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని కుడకుడ ప్రాంతంలో శ్రీ గణేష్ ట్రాక్టర్స్ మహేంద్ర ప్యాడి హార్వెస్టర్ షోరూమ్ ప్రారంభించి మాట్లాడారు.రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేలా దిగబాటు పొలాల్లో సైతం సులభంగా మహేంద్ర హార్వెస్టర్ పొలాలు కటింగ్ చేయబడుతుందని అన్నారు.102 హెచ్ పి ఇంజన్ తో మహేంద్ర హార్వెస్టర్ ను రూపొందించడం జరిగిందని తెలిపారు.తక్కువ సమయంలో దిగబాటు పొలాల్లో సైతం వరి పొలాలు కటింగ్ చేయడం జరుగుతుందని, రైతులకు సమయం ఆదా అవుతుందన్నారు. ప్రభుత్వ ఆమోదం పొందిన అన్ని బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని, సబ్సిడీ సైతం అందించడం జరుగుతుందన్నారు.శ్రీ గణేష్ ట్రాక్టర్స్ ఉమ్మడి నల్గొండ జిల్లా డీలర్ పోలా నరసింహారావు మాట్లాడుతూ బుకింగ్ ప్రారంభించడం జరిగిందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర ఫామ్ మిషనరీ డివిజన్ నేషనల్ సేల్స్ హెడ్ ఆనంద్ కసబీర్, జోనల్ సర్వీస్ అండ్ సేల్స్ మేనేజర్ మహేంద్ర కుమార్, తెలంగాణ ఏరియా సర్వీస్ మేనేజర్ హేమంత్ కుమార్, రాష్ట్ర ఆల్ డీలర్స్,రైతులు, సైదిరెడ్డి, సంజీవ్, సైదులు, శ్యామ్ రెడ్డి పాల్గొన్నారు.



## ఖమ్మంలో ఘోర రోడ్డు ప్రమాదం

### తండ్రి కొడుకులు మృతి



**ఖమ్మం, జూన్ 5 (జనంసాక్షి)** ఖమ్మం నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని దుబ్బతండ గ్రామానికి చెందిన అజ్మీరా బాల్య (50) తన కొడుకు సాయి కుమార్ ద్విచక్రవాహనంపై ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వైరా రోడ్డు వైపు వెళు తున్నారు.ఈ క్రమంలోనే వెనుక నుంచి ఓ లారీ ఢీ కొట్టింది. దీంతో వారిద్దరూ లారీ టైర్ కింద పడడంతో మృతి చెందారు. సాయి కుమార్ ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లారీని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పర్యావరణాన్ని సంరక్షించడం మనందరి బాధ్యత



**చౌటుప్పల్, జూన్ 5(జనంసాక్షి):** పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సహస్ర ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చినుకని శివప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మిషన్ గ్రీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సహస్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో, మండల పరిధిలోని పంతంగి గ్రామంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతికి మానవునికి అవినాభావ సంబంధం ఉందన్నారు. పర్యావరణాన్ని రక్షించడం ద్వారా ప్రాణ వాయువును సురక్షితంగా భవిష్యత్ తరాలకు అందించ వచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల న్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతల శ్రీకాంత్, సీహెచ్వో జ్యోతి, సాయి, లింగస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంచుదాం భవిష్యత్తు తరాలకు జీవన అవకాశాన్ని అందిద్దాం



**కల్లూరు జూన్ 05 (జనంసాక్షి)** వాతావరణ కాలుష్యం నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు భవిష్యత్ తరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కల్లూరు మున్సిపాలిటీ ఈవో నంది శెట్టి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఖాన్ ఖాన్ పేట ఎన్ఎస్పి సమీపానగల ఫిల్టర్ బెడ్ ఆవరణలోని ప్రకృతి వనంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని, భూసారాన్ని దెబ్బతీస్తూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని కోరారు.జీవకోటి మనుగడకు ప్రాణవాయువును అందించే చెట్లను ప్రతి ఒక్కరు బాధ్యతగా పెంచి కాపాడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### మొక్కలు నాటిన డిఆర్డిఏ ఏపీడి శ్రీదేవి





**ఖమ్మం రూరల్, జూన్ 05 (జనంసాక్షి )** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మండలంలోని ఎం. వెంకటాయ పాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఆర్డిఏ ఏపీడి శ్రీదేవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని, విద్యార్థులు కూడా హరిత దూతలుగా మారాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్ ఎం జి.శ్రీనివాస రావు, ఏపీవో శ్రీదేవి,ఏపిఎం శ్రీదేవి,ప్లాంటేషన్ సూపర్వైజర్ విజయలక్ష్మి,టి ఏ నీలిమ,పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి,ఫీల్డ్ అసిస్టెంట్ శోభ, లాలయ్య,విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు

### బిఆర్ఎస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ నాయకులు రాచకొండ గిరి



**సంస్థాన్ నారాయణపురం. జూన్ 5. (జనంసాక్షి):** సంస్థాన్ నారాయణపురం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని, సగానికి పైగా అనర్హులకే ఇండ్లు కేటాయించారని , భూములు ఉన్నవారికి అర్హత లేనివారికి ఇల్లులు కేటాయించారని ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతివాటం ప్రదర్శించారనీ బిఆర్ఎస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ యువజన విభాగం నాయకులు రాచకొండ గిరి పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఎంతోమంది నిరుపేదలు భూములు లేక, ఇండ్లు లేక అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారికి కాకుండా కాంగ్రెస్ నాయకులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో సగానికి పైగా అనర్హులేననీ అన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక పారదర్శకంగా జరగాలని ప్రతి నిరుపేదకు పథకం అందాలని ప్రభుత్వ పెద్దలు ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెబుతుంటే. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం వారి ఆదేశాలను విస్మరించి ఇష్టరీతిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడం సిగ్గుచేటని ఆరోపించారు. ప్రజాపాలనలో ప్రభుత్వ అధికారుల పాత్ర పేక్షక పాత్ర గానే మిగిలిందని, దరఖాస్తుదారుని పూర్తి స్థితిగతులు, వివరాలు వాస్తవాలను తెలుసుకోకుండానే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన లిస్ట్ ఫైనల్ చేయడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి ప్రజలు ప్రభుత్వ అధికారులను విశ్వసిస్తారు వారిపైనే భరోసా పెడతారు. కానీ ప్రభుత్వ అధికారులు మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆదేశాలతో నడవడం నిజంగా బాధాకరమే. అధికారులు ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదనేది స్పష్టంగా స్పష్టమవుతుంది. ఇందిరమ్మ కమిటీల పేరా నడిచిన రాజకీయం అంత ఇంత కాదు. బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక ప్రక్రియలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులకే వత్తాసు పలుకుతున్న అధికారుల పేర్లను రెడ్ బుక్ లో రాసుకుంటాం వచ్చేది మా ప్రభుత్వమే అప్పుడు తప్పక చూసుకుంటామని తెలిపారు.ప్రజలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. గ్రామాల ల్లో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, మళ్లీ సారే రావాలి, కారే కావాలి, కేసీఆర్ రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని భారీ స్థాయిలో గెలిపించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా బిఆర్ఎస్ పాలన జరిగితే....నేడు కక్షలు, కుట్రలు,కుతంత్రాలతో కక్ష సాధింపు చర్యలతో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని,ఈ సందర్భంగా వారు అన్నారు.

# ఎంపీగా రఘురాం రెడ్డి ఏడాది పూర్తయిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

## రక్తదానం చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ





**ఖమ్మం, జూన్ 5 (జనంసాక్షి):** ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి తన ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో తల సేమియా చిన్నారుల కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ రక్తదానం చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అనుచరుల్లో ఒకరిగా ఉన్న ఉమ్మినేని కృష్ణ గతంలో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు పలుమార్లు రక్తదానం చేశారు. అంతేకాక అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం, శస్త్ర చికిత్సల నిమిత్తం పేదలు ఎవరైనా ఆసుపత్రిలో ఉన్నారని తెలిసిన వెంటనే రక్తం అవసరం పడితే వెంటనే ఆసుపత్రికి వెళ్లి రక్త దానం చేస్తారు . ఎంపీ ఏడాది పాల సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని రక్త దానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కోటా రాంబాబు, ఎడ్లపల్లి సంతో బాలసాని లక్ష్మీ నారాయణ , మిక్కిలి నేని నరేందర్, మంజుల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పొంగులేటి కార్యాలయం ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి గారు కూరపాటి ప్రదీప్ మున్సిపల్ చైర్మన్ నీర పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణలో మహిళలు

**భూదాన్ పోచంపల్లి, జూన్ 5(జనం సాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ చెరువు వద్ద ఉమెన్స్ ఫర్ ట్రీ ప్లాంటేషన్ లో భాగంగా గురువారం మునిసిపల్ కమిషనర్ డి.అంజన్ రెడ్డి, మహిళ సంఘ సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

### కాలుష్యాన్ని తగ్గించాలంటే

## ప్రతి ఒక్కరు చెట్లను కాపాడాలి

**చౌటుప్పల్, జూన్ 5 (జనంసాక్షి)** పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రతి ఒక్కరు చెట్లను కాపాడాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని దండు మల్కాపురం గ్రామంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**నేరేడుచర్ల (జనంసాక్షి):** లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ నేరేడుచర్ల ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షులు రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు,లయన్స్ క్లబ్ డిస్టిక్ చైర్పర్సన్ బట్టు మధు,జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి హాజరై వారు మాట్లాడుతూ, ప్రపంచ జీవనావళి శాశ్వతంగా కొనసాగాలంటే మనం పర్యావరణాన్ని సమతుల్యంలో ఉంచాలి.ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి పెంచాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి, పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలి అని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అందరూ కలిసి



పర్యావరణ పరిరక్షణకు నిబద్ధంగా పనిచేసేందుకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి షేక్ యూసుఫ్,గ్యాట్ మెంబర్ చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, శ్రీను, ఏసు, ప్రదీప్,పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేటలో అవగాహన ర్యాలీని నిర్వహించిన జిల్లా బాల భవన్ విద్యార్థులు




## దేవరకొండ మున్సిపాలిటీలో పచ్చదనం వెల్లివిరిసేలా కృషి చేయాలి

దేవరకొండ, జూన్ 05(జనం సాక్షి) పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, వాటిని మనం రక్షిస్తే, మనల్ని అవి రక్షిస్తాయని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఖిల్లా పార్కులో నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ సిబ్బంది పచ్చని చెట్లపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో శానిటరీ ఇన్స్పెక్టర్ సూరిగి శంకర్ , సీనియర్ అసిస్టెంట్ రాకేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్రు నాయక్, వార్డు అధికారి పెదన్న,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ డీజిల్ అందించాలి

- మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి



**కొండమల్లేపల్లి, జూన్ 5 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి మండల కేంద్రం నల్గొండ రోడ్ గుమ్మడవల్లి గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి పిజెఆర్ ఫిల్లింగ్ స్టేషన్ ను గురువారం మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులతో కలిసి నూతన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వాహన వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఫిల్లింగ్ స్టేషన్ లో వాహనదారులకు ఉచిత సౌకర్యాలు వాహన టైర్ లో గాలి నింపడం, పెట్రోల్, డీజిల్ బిల్లును పొందే హక్కు, ప్రథమ చికిత్స పెట్టె సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం, అత్యవసర ఫోన్ కాల్, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు వంటి కొన్ని ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. వీటికి ఎటువంటి ఛార్జీలు చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. వాహనదారులకు ఏదైనా గాయం అయినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో పెట్రోల్ బంక్‌లో ఉన్న ప్రథమ చికిత్స బాక్సులోని మందులను ఉపయోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. పెట్రోల్ బంకు పరిసరాలలో పచ్చని మొక్కలు నాటాలని, బంకు నిర్వాహకులు పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథులకు పిజెఆర్ ఫీలింగ్ స్టేషన్ డీలర్ పెద్దబావి జనార్దన్ రెడ్డి పద్మావతి, అభిలాష్ రెడ్డి మాధురి, శివనంద రెడ్డి స్నేహ దంపతులు అతిథులకు శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పురోహితులు వైద్యుల కృష్ణమూర్తి, అనంత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బోడ యాదయ్య యాదవ్, పంపాటి శ్రీధర్, చెట్లపల్లి శ్రీనివాస్, మంచికంటి జగన్మోహన్, బండారు రాము, బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, గంధం సురేష్, మంగ్యా నాయక్, స్వామి, మున్నా, బొడ్డుపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం

**తహసిల్దార్ లాల్ బహదూర్**

**రామన్నపేట, జూన్ 5 (జనంసాక్షి) :** భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారమవుతుందని తహసిల్దార్ లాల్ బహదూర్ అన్నారు.రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామంలో గురువారం మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసిల్దార్ రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుండి ఆర్జీలను స్వీకరించారు. భూ సమస్యలు ఉన్న ప్రతి రైతు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయవచ్చునని వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించడం జరుగుతుందని తహసిల్దార్ తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శోభ, సీనియర్ అసిస్టెంట్ గాలయ్య, జూనియర్ అసిస్టెంట్ స్రవంతి, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కారం

**కొండమల్లేపల్లి, జూన్ 5 (జనంసాక్షి):** భూ సమస్యలు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులలో భూ సమస్యలు పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే భూభారతి చట్టం పకడ్బందీగా అమలు చేస్తున్నామని తహసిల్దార్ నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించి ప్రజలు రైతులకు ఎలాంటి భూ సమస్యలు లేకుండా చేస్తామని తెలిపారు. మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో తహసిల్దార్ నరేందర్ ఆధ్వర్యంలో, ఏపూర్ గ్రామంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రశాంత్ ఆధ్వర్యంలో గురువారం భూ భారతి సదస్సులు నిర్వహించారు. గుమ్మడవల్లి గ్రామంలో విస్తరణ దిద్దుబాటు 12, పిఓబి 02, భూమి స్వభావం మార్పు 01, కోర్టు కేసు 01, మిస్సింగ్ సర్వే 01, ఇతరులు 01 మొత్తం 18 దరఖాస్తులు. ఏపూర్ గ్రామంలో జెండర్ కరెక్షన్ 01, రైతుల దరఖాస్తులు రెండు గ్రామాలలో కలిపి 19 భూ సమస్యల దరఖాస్తు లు వచ్చాయని తెలిపారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరిస్తామని తహసిల్దార్ తెలిపారు. శుక్రవారం దోనియాల, వర్ధమాని గూడెం రెవిన్యూ గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు ఉంటాయని ప్రజలు, రైతులు భూ సమస్యలు ఉంటే రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్ఏలు రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వ్యక్తి మృతి

**చౌటుప్పల్, జూన్ 5(జనం సాక్షి ):** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న పడాల వెంకటేశ్వరరావు (50) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఇతను ప్రస్తుతం శాంతినగర్, చౌటుప్పల్‌లో నివాసముంటునాడు. గురువారం ఉదయం 6:30 గంటల సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి భార్య పడాల పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహోన్నత త్యాగానికి ప్రతీక బక్రీద్

**అల్ హాజ్ సయ్యద్ నూరోద్దీన్ సహాబ్**



**కొండమల్లేపల్లి, జూన్ 5 (జనంసాక్షి):** త్యాగానికి సహనానికి మంచితనానికి ప్రత్యేక పండుగ బక్రీద్ అని రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ వాస్తు నిపుణులు అల్ హాజ్ సయ్యద్ నూరోద్దీన్ సహాబ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులు రంజాన్ తరహాలో బక్రీద్?ను కూడా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ఇస్లాం ధర్మాన్ని ప్రపంచంలో కోట్లాది మంది అవలంభిస్తున్నారని శాంతి, సహనం, దయ, కరుణ, ప్రేమ, ఐకమత్యం, మానవత్వాన్ని బోధిస్తుందని తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా పూర్వీకులను కొలుస్తారని చెప్పారు. భక్తిని, త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ చాటి చెప్తుందని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా, అల్లాపై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ మానవాళికి ఇస్తున్నదని అన్నారు. తమకు కలిగిన దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిగిస్తుందన్నారు. అల్లా పంపిన దైవ ప్రవక్తలలో ఇబ్రహీం ప్రవక్త గారు గొప్ప ప్రవక్తల్లో ఒకరన్నారు. ఇబ్రహీం ప్రవక్త గారికి ఖలీలుల్లాహ్ అనే బిరుదు ఉండేదని ఖలీలుల్లాహ్ అంటే అల్లాహ్ మిత్రుడు అని అర్థం. దైవ ప్రసన్నత కోసం చేసే కార్యాన్ని మించినది లేదని తన జీవితం ద్వారా ఇబ్రహీం ప్రవక్త గారు నిరూపించారన్నారు. కలలో ఏదైనా కనిపిస్తే అది ఆ కరుణామయుడైన అల్లా ఆజ్ఞేనని భావించేవారని వెంటనే ఆచరించేవారన్నారు. ఒక రోజు ఇబ్రహీం ప్రవక్త గారికి తన కన్న కొడుకును బలి ఇస్తున్నట్టు కల వచ్చిందని నిజానికి అది కల కాదు, దైవాదేశ పాలనలో ప్రేమానురాగాలకు తావులేదని చాటి చెప్పేందుకు ఇబ్రహీం ప్రవక్త గారికి ఎదురైన విషమ పరీక్ష అని వృద్ధాప్యంలో లేకలేక కలిగిన ఏకైక సంతానాన్ని, ఎంతో భవిష్యత్తు కలిగిన కొడుకుని చేతులారా బలి ఇవ్వాల్సి రావడం ఏ తండ్రికయినా కడుపుకోతే. అయితే ఆ కలను కూడా దైవాజ్ఞగా పరిగణించారు ఇబ్రహీం ప్రవక్త గారు. తన కుమారుడు ఇస్మాయిల్‌ను పిలిచి విషయం చెప్పారు తండ్రికి తగిన తనయుడైన ఇస్మాయిల్ ఏమాత్రం ఆలోచించకుండా నాన్నగారూ దైవాదేశాన్ని వెంటనే నెరవేర్చండి అని నేను దానికి సిద్ధంగా ఉన్నానని దేవుని అనుగ్రహం ఉంటే నన్ను మీరు సహనశీలిగా చూస్తారు అన్నారు. తన ప్రాణం కన్నా మిన్న అయిన కొడుకును చంపడానికి ఇబ్రహీం ప్రవక్త గారు ఉద్యుక్తులయ్యారు. ఇబ్రహీమ్ ప్రవక్త గారు నేలమీద పడుకున్నారు. అతని తల నరకడానికి ఇబ్రహీం కత్తి పైకి తీశారు వారి త్యాగశీలతకు సృష్టి యావత్తూ అచ్చెరువొందింది గాలి స్తంభించింది అంతటా నిశ్శబ్దం ఆవరించింది. అప్పుడు నా ప్రియ ప్రవక్తా ఇబ్రహీం నువ్వు నీ కలలోని సంఘటనను నిజం చేసి చూపించావు నా ఆజ్ఞా పాలనకు మీరు మానసికంగా సిద్ధమైన క్షణంలోనే నేను మీకు ప్రసన్నుణ్ణయ్యాను. నా పరీక్షలో మీరు అత్యుత్తమ శ్రేణిలో నెగ్గారు అంటూ దిక్కులు పిక్కటిల్లేలా దైవవాణి వినిపించింది ఆ వెంటనే అల్లాహ్ పంపిన పొట్టేలుతో స్వర్గం నుంచి దైవదూత దిగివచ్చాడు ఆ పొట్టేలును ప్రవక్త ఇబ్రహీం బలి ఇచ్చారు.ఇబ్రహీం, ఇస్మాయిల్ తండ్రి కుమారుల త్యాగ నిరతిని స్మరించుకోవడం కోసం ముస్లింలు ప్రతి సంవత్సరం బక్రీద్ పండుగ జరుపుకొంటారు. ఈ పండుగను ఈదుల్ అజ్‌హా అనీ బక్రీద్ అనీ ఈదె ఖుర్బాన అనీ, త్యాగోత్సవం అని వ్యవహరిస్తారు. ఇస్లాం క్యాలెండర్‌లోని జిల్ హిజ్జా మాసం పదవ రోజున నిర్వహించే ఈ పండుగ మహోన్నత త్యాగానికి సంకేతం అని అల్లాహ్ మార్గంలో తమ ప్రాణాలను త్యాగం చెయ్యడానికి సిద్ధమని ఖుర్బానీ ద్వారా చాటి చెప్పడం ఈ పండుగ ప్రధానోద్దేశం అన్నారు. ఎంతో పుణ్యం చేసుకుంటే కానీ వచ్చిన మానవ జన్మను సార్ధకం చేసుకోవాలని ఈర్ష్య స్వార్థం అహంకారం వీడి తోటి మానవులతో పాటు భగవంతుడు సృష్టించిన అన్ని రకాల జీవులపై ప్రేమానురాగంతో జీవించాలన్నారు ముస్లిం సోదరులు రంజాన్ తర్వాత పరమ పవిత్రంగా భావించే బక్రీద్ పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆశిస్తూ ముస్లిం సోదరులతో పాటు సమస్త ప్రజలకు అల్ హాజ్ సయ్యద్ నూరోద్దీన్ సహాబ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రకృతి విపత్తుల నివారణపై మండల స్థాయి అవగాహన సదస్సు

**కల్లూరు జూన్ 05 (జనంసాక్షి)**
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కల్లూరు రైతు వేదికలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తుల నివారణ పై ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు వైద్య సిబ్బంది కార్యదర్శులకు వివిధ శాఖల అధికారులకు అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సునీత,తహశీల్దార్ పులి సాంబశివుడు పాల్గొని ప్రసంగించారు . విపత్తుల నివారణ చర్యల్లో భాగంగా వర్షాకాలంలో మండల పరిధిలోని అన్ని శాఖలకు సంబంధిం చిన అధికారులు సమన్వయంతో పనిచేయాల న్నారు. నిర్లక్ష్యంగా అలసత్యం వహించే అధికారులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు, జంతువులకు ఎలాంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వర్షాకాలంలో సంభవించే వైరల్ ఫీవర్,డెంగ్యూ, మలేరియా ,టైపాడ్, కోవిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీరు నిలవ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని ప్రజల యొక్క సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వర్తించాలని కోరారు. విపత్తు సమయంలో సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లో నివాసం ఉండేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని , సూచించారు . విద్యుత్ సరఫరా లో ఎక్కడైనా అంతరాయం కలిగిన, విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్న, లో వోల్టేజీ సమస్య, విద్యుత్ స్తంభాలు



ఒరిగిపోయినా విరిగిపోయిన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యుత్ శాఖ ఏఈ వెంకట్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రంజిత్ కుమార్ ఎంఈఓ నివేదిత, ఏపిఎం బీరవల్లి రాంబాబు ,ఏసీడీపీఓ రత్తమ్మ ,వైద్యాధికారులు నవ్య కాంత్, విద్యుత్ ఏఈ వెంకట్,గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

**మధిర, జూన్ 5 జనంసాక్షి:**
అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మధిర పట్టణ బీజేపీ అధ్యక్షులు శివరాజు సుమంత్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా మాతృమూర్తి పేరిట మొక్కలు నాటే కార్యక్రమం లో భాగంగా మధిర పట్టణంలో జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరావు శక్తి కేంద్ర పరిధిలో17వ వార్డు లో ఈరోజు మొక్కలు నాటడం జరిగినది.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ మాతృమూర్తి పేరిట మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తూ,పర్యావరణాన్ని కాపాడవలసిందిగా ఖమ్మం జిల్లా బిజెపి జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, జిల్లా మన్కిబాద్ కన్వీనర్ మర్సకట్ల స్వర్ణకర్, జిల్లా నాయకులు పాపట్ల రమేష్, రఘురామ్ రెడ్డి,పగడాల నాగేంద్రబాబు,బియ్యవరపు రామకృష్ణ, మాదిరాజు సాయిరాం,SK గౌసిద్దీన్, పింజారి ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన ధర్వేశిపురం ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు

**○నేడు రేణుక ఎల్లమ్మ-జమదగ్నిలా కళ్యాణ మహోత్సవములో పాల్గొననున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**కనగల్లు, జూన్ 5 (జనంసాక్షి)**
మండలములోని ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ ఎల్లమ్మ అమ్మవారి (జాతర) బ్రహ్మోత్సవాలలు మూడు రోజులపాటు కొనసాగుతాయి. గురువారం విగ్నేశ్వర పూజ, పుణ్య వాచనం, ధ్వజరోహణ, దేవి మూల మంత్ర హెూమం, దుర్గా హెూమం, బలిహరణ, గవంత పూజలు , వాస్తు పూజ, నిత్యా హెూమం,, రక్ష బంధనం, సాయంత్రం ఎదుర్కొల్లు లటి కార్యక్రమాలు ఆలయ పండితుల వేద మంత్రాలతో, డప్పు, వాయిద్యముల నడుమ జరిగాయి.నేడు శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ-జమదగ్ని మహామునిల 23వ కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనములు %ు% సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హాజరవుతారని ఆలయ చైర్మన్ చీదేటివెంకట్ రెడ్డి ఆలయ ఈవో జిల్లపల్లి జయరామయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కే శంకర్ రెడ్డి, సిహెచ్ నగేష్ గౌడ్, ఎన్ బాబు, కే ప్రభాకర్, ఆర్ వెంకన్న, ఎన్ రమేష్, కే నరేష్, ఎన్ రాజు, బి సైదులు, జె నవీన్, ఎన్ అంజయ్య, సిహెచ్ దుర్గమ్మ, ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, సిహెచ్ శ్రవణ కుమారా ఆచార్యులు, దామోదర రావు, ఉమామహేశ్వరరావు, ఫణి కుమారా చారి, శ్రీనివాస ఆచారి,%ుతీ% అసిస్టెంట్లు జై చంద్ర గౌడ్, జి నాగేశ్వరరావు, %ుతీ% అసిస్టెంట్ లు కే ఉపేందర్ రెడ్డి, ఎన్ ఆంజనేయులు, జే నాగరాజు, టి రాజయ్య, రాజు, సిహెచ్ శ్రీకర్ ఎక్స్ చైర్మన్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులకు దూరంగా ఉండాలంటే.. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



**చంద్రుగొండ, జూన్ 5 (జనంసాక్షి):**
వ్యాధులకు దూరంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డి ఎం డి హెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. గురువారం చంద్రుగొండ పీహెచ్సీ ని ఆమె సందర్శించి ఆషాడేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు సూచనలు చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పీహెచ్సీలో ల్యాబ్ రిజిస్టర్స్ ,డ్రగ్స్ స్టాక్ రిజిస్టర్స్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తనూజ డాక్టర్ వెంకట ప్రకాష్ డాక్టర్ నేహా సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి: ఎంపీడీవో

- ○ గ్రామాలలో నీటి నిలువలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి..
- ○ పట్టణాలలో మురికి నీరు చెత్త లేకుండా చర్యలు చేపట్టాలి..
- ○ గ్రామపంచాయతీలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలి..

**మణుగూరు, జూన్ 05 (జనం సాక్షి):**
వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి తగిన చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెల్లూరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ...రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామస్థాయిలో మెడికల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ , మండల పంచాయతీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఆయా శాఖల సమన్వయంతో ప్రజారోగ్య ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత పాటించడం, సీజనల్ వ్యాధుల రాకుండా ముందస్తు చర్యలపై అవగాహన కల్పించాలన్నారు.

**నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు:**
మనం రోజు వాడే నీరు నిలువ లేకుండా చూసుకోవాలి ఒకవేళ అలాంటి పరిస్థితి ఏర్పడితే వాటిని మురికి కాలువలో చేరే విధంగా చూసుకోవాలి. అదేవిధంగా వర్షాకాలంలో మన చుట్టూ ఉన్న పరిసరాలలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలి. మట్టి కుండలు, ప్లాస్టిక్ డబ్బాలలో, కుండీలలో నీటి నిల్వలు ఎక్కువగా ఉంటాయి. ఇలా నిల్వ ఉండటం వల్ల దోమలు క్రిమి కీటకాలు వృద్ధి చెందు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది వాటిని అరికట్టే విధంగా వారికి అవగాహన కల్పించాలి.

**కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులు:**
వర్షాకాలంలో చల్లదనానికి
దోమలు, ఈగలు ఎక్కువగా వస్తుంటాయి వాటి వల్ల బ్యాక్టీరియా వృద్ధి చెందుతాయి. దోమలు ఈగలు కుట్టడం వల్ల మలేరియా , టైఫాయిడ్, కలరా, డెంగ్యూ జ్వరం, చికెన్ గున్యా, ఎల్లో ఫీవర్, వైరల్ ఫీవర్. వ్యాదులు వస్తాయి. ఇవి వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలి. నీటి నిల్వలు లేకుండా పారిశుధ్యం పనులను ఎప్పటికప్పుడు చేసుకోవాలి.

**జంతువుల వలన వచ్చే వ్యాధులు:**
మనలో చాలామంది జంతువులు ఇష్టపడతారు. వాటితో ఎక్కువగా గడపడం వల్ల వాటి ద్వారా మనకు వైరస్ సోకి అనేక రకాల అంటువ్యాధులు





సంక్రమిస్తాయి. కుక్కలు ,పందులు వీటి ద్వారా ఎక్కువగా ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. కుక్కలను పెంచుకునే వారికి తగిన జాగ్రత్తలు తీసుకొనే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. మున్సిపాలిటీ గ్రామపంచాయతీ లలో మలేరియా నివారణ కోసం రిసిడ్యూయల్ స్ప్రే చేయాలి. అదే విధంగా గ్రామాల్లో ఆరోగ్య క్యాంపులు ఏర్పాటు చేయాలి శానిటేషన్ మెరుగుపర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి.డ్రైనేజీ చెత్త నిర్వహణ పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు వ్యాధులు ప్రబలకుండాఅందరూ కలిసి సమన్వయంతో కార్యాచరణను అమలు చేసి ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎం పి ఓ వెంకటేశ్వర్లు మెడికల్ ఆఫీసర్ నిశాంత్, వైద్యులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి..



**బూర్గంపహాడ్ జూన్ 05 (జనంసాక్షి)**
భద్రాది కొత్తగూడెం జిల్లా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు డిమాండ్ చేసారు. బీసీలకి 42 శాంతం రిజర్వేషన్స్ కల్పించే అంశం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధాన పరమైన ప్రకటన చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్స్ పార్టీ పరంగా టిక్కెట్ వద్దు, బీసీలకు న్యాయ పరమైన, గౌరవప్రదంగా 42 శాంతం పెంచలని, బీసీ బిల్లుకు న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా చూసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# మన ఊరి బడి ఈడు పిల్లల ను మన ఊరి ప్రభుత్వ బడుల్లో నే చదివిద్దాం

## టిఎస్ యుటిఎఫ్



**మర్రిగూడ, జూన్ 5(జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖచే నిర్వహిస్తున్న ప్రచార జాత మర్రిగూడ మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన ఊరిప్రభుత్వ బడి ముద్దు ప్రైవేట్ బడి వద్దు అనే నినాదంతో ప్రచార జాత నిర్వహిస్తున్నామని, మన ఊరి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ బోధనతోపాటు రెండు జతల ఉచిత యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనము,రాగి జావా, ఉచిత పాఠ్య పుస్తకాలు, నో టు పుస్తకాలు వాటితో పాటు నాణ్యమైన సమానమైన అంతరాలు లేని ఆంగ్ల బోధన నిర్వహిస్తూ మన ఊరిలోనే ఆంగ్ల బోధన అందిస్తున్నాము. అందమైన అలంకరణ గల తరగతి గదులు ,బెంచీలు టి.ఎల్.ఎమ్ తో బోధన మెరుగైన వసతులతో ఉన్నతమైన విద్యా అర్హతలతోఉన్న ఉపాధ్యాయులు బోధనను అందిస్తున్నాము .ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశము నిర్వహిస్తూ తల్లిదండ్రులు అంగీకారంతో పాఠశాల నడుపుతున్నాము. పిల్లల అభివృద్ధి ఊరి అభివృద్ధి గా భావిస్తూ మన పాఠశాల పనిచేస్తున్నది అని తెలిపారు.మర్రిగూడ మండల అధ్యక్షులు నాగవరం శ్రీనివాసరావు మాట్లాడుతూ మన పిల్లలనుమన ఊరి బడి లో చేరుద్దాం మన పిల్లల అభివృద్ధి కోసం మనమే ముందుండి మన భవిష్యత్తు కోసం నిలబడదాం అని , తల్లిదండ్రులను చైతన్య పరచడం జరిగింది. యరగండ్లపల్లి,తిరుగండ్లపల్లి, మర్రిగూడ, కొండూరు,ఇందుర్తి, శివన్నగూడ, కుదాబక్ష పల్లి, తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచారం జాత కార్యక్రమంలో మర్రిగూడ మండల ప్రధాన కార్యదర్శి పున్న కృష్ణయ్య, కోశాధికారి బండారు గోవర్ధన్, మండల కమిటీ సభ్యులు, రజియుద్దీన్,అశోక్, కరీం, వివేకానంద యూత్ క్లబ్ రాష్ట్ర ఆర్గనైజర్ వారాల రాంచంద్రం గారు, వివిధ గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆటో కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

హుజూర్ నగర్, జూన్ 5 (జనంసాక్షి):
పట్టణంలోని తిలక్ నగర్ 14 వార్డుకు చెందిన ఆటో కార్మికుడు గొర్రె వీరబాబు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించాడు. గురువారం రాజీవ్ గాంధీ మట్టపల్లి ఆటో యూనియన్ కార్మికులు తమవంతుగా 50,016 రూపాయలు , 25 కేజీల బియ్యం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ఆటో యూనియన్ అధ్యక్షులు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ అనారోగ్యంతో గొర్రె వీరబాబు మరణించడం తీరని లోటు అని అన్నారు. ఆటో యూనియన్ లో ఎవరికీ ఏమి జరిగినా గత సంవత్సరాల కాలం నుంచి చాలామంది ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం అందించామన్నారు. వీరబాబు కుటుంబానికి కూడా ఆటో యూనియన్ ఎప్పుడు అండగా ఉంటదన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ ఆర్ ట్రస్ట్ చెర్మన్ దగ్గుపాటి బాబురావు, రాజీవ్ గాంధీ ఆటో యూనియన్ కార్మికులు, కమిటీ సభ్యులు రెడపంగు రాము, ఉపాధ్యక్షులు, మునగ సైదులు కోశాధికారి, జక్కుల శీను ఆర్గనైజర్ సెక్రెటరీ, ఆటో యూనియన్, సభ్యులు, కస్తాల రవి, పులిపాటి నాగరాజు, రాతికింది వెంకటరమణ, రాతికింది నరసింహారావు, డి. అనిల్, ఐల ప్రేమ్, ఎస్ కే హుసేన్, ఎస్ కే హబీబ్, ఎస్ డి నిజాముద్దీన్, రాము, ఎస్కే ఖాదర్, రాజేష్ పాస్టర్, ఐత గాని వీరబాబు, సోమగాని నరసింహ, వీరబాబు కుటుంబ సభ్యులు, గొర్రె నరసింహారావు, నాగరాజు, జడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ప్రజల పక్షం

- పేదల సమానత్వానికి, కార్పొరేట్ శక్తులను వ్యతిరేకిస్తుంది
- ఈనెల 8న జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా మహాసభ
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు
- పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు



**హుజూర్ నగర్, జూన్ 5 (జనంసాక్షి):**
దేశంలో అట్టడుగు వర్గాలకు ప్రజల పక్షం ఎల్లవేళలా సిపిఐ నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హుజూర్ నగర్ లో సిపిఐ కార్యాలయంలో ఈనెల 8న జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సమానత్వానికి మద్దతు పలుకుతూ, కార్పొరేట్ శక్తుల దోపిడిని వ్యతిరేకిస్తూ సిపిఐ కార్మికుల పక్షాన నిలుస్తుంది అన్నారు.
విద్యా, ఉపాధి ఆరోగ్య రంగాలలో ప్రజలందరికీ సమాన అవకాశాలు ఉండాలని సిపిఐ కోరుకుంటుందన్నారు. రాష్ట్ర నాయకులు పాల్గొని జిల్లా మహాసభలో సిపిఐ నాయకులు కార్యకర్తలు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ నాయకులు మామిడి వెంకయ్య, సోమ గాని కృష్ణ, జడ వెంకన్న, చక్రాల స్టాలిన్, మామిడి నరసయ్య, చేన్నగాని సైదులు, యల్లావుల సురేందర్, చక్రాల వెంకటేశ్వర్లు, గొల్ల గోపు వీరేశం, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా రచ్చ యాదగిరి

**రామన్నపేట, జూన్ 5 (జనంసాక్షి):**



సిపిఐ పార్టీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా రచ్చ యాదగిరి, సహాయ కార్యదర్శిగా ఎనూతల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మండల కార్యదర్శి ముత్తుకూరు నరసింహ తెలిపారు. సిపిఐ పార్టీ మండల కార్యాలయంలో 18వ మహాసభ ఊట్కూరి భగవంతు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ సీపీఐ పార్టీ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ కార్మిక, కర్షకులకు అండగా ఉంటూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేస్తున్నామని, అందుకే గ్రామ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివరాత్రి సమ్మయ్య సీనియర్ కామ్రేడ్ బాలగోని మల్లయ్య, వీరమల్ల ముత్తయ్య, గంగాపురం వెంకటయ్య, పల్లె మల్లేశం, గంగాపురం మల్లమ్మ, ఊట్కూర్ కృష్ణ, సిహెచ్ మల్లేశం, కళ్యాణ్, యాదగిరి సుదర్శన్, పట్ల నర్సింలు, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.





# వివాహా వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, జూన్ 5 (జనంసాక్షి):
మండలంలోని ఎన్నారం గ్రామ మాజీ సర్పంచ్ మెట్టు మహేందర్ రెడ్డి వివాహము మిర్యాలగూడలో బండి కన్వెన్షన్ హాల్లో జరగగా అట్టి వివాహమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్ రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ దేశపాక లక్ష్మీనరసింహ మాజీ ఉప సర్పంచులు పల్సం భిక్షం, సామ సుధాకర్ రెడ్డి నాయకులు మల్లయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ తో ఎన్నో మేళ్ళు మాచన రఘునందన్

**మర్రిగూడ,జూన్ 5( జనం సాక్షి )**
మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ కు మన వంతు కృషి చేయాలని పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ పిలుపునిచ్చారు.గురువారం నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రఘునందన్ తన తల్లి తో కలసి మొక్కను నాటారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..పుట్టిన రోజు,పదోన్నతి, ఇలా ఏ సందర్భం లోనూ..ఒక్క మొక్క నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ కు మన వంతు కృషి చేసిన ఆత్మ సంతృప్తి మనకు కలుగుతుందని రఘునందన్ అన్నారు.ప్రకృతి నుంచి మనం అన్ని తీసుకోవడమే తప్ప మనం ఏమి ఇవ్వటం లేదని రఘునందన్ అవేదన వ్యక్తం చేశారు.సందర్భం ఉన్నా లేకున్నా ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటితే ఊరూరా వనం సాధ్యం అని రఘునందన్ అన్నారు.చెట్లు ప్రగతికి మెట్లు అని,పర్యావరణ పరిరక్షణ తో నే క్షేమం, అటవులు లేక పోతే క్షామం అని ప్రతి ఒక్కరూ గమనించాలని "మాచన" అన్నారు. ఈ వర్షా కాలం లో ప్రతి ఒక్కరూ తమ తమ వయస్సు(సంఖ్య) బట్టి మొక్కలు నాటితే స్ఫూర్తి దాయకంగా ఉంటుందని రఘునందన్ అభిప్రాయపడ్డారు.ప్రాణ వాయువు ను ప్రసాదించేది పర్యావరణ మే అని రఘునందన్ స్పష్టం చేశారు.